పవిత్రోత్సవాలకు శ్రీస్వామి అనుజ్ఞాస్వీకారం



పవిత్రోత్సవాలను ప్రార్థనా సూక్త పఠనంతో శ్రీస్వామి అనుజ్ఞను స్వీకరిస్తున్న యాజ్ఞీకులు

మఠంపల్లి, న్యూస్‌టుడే: మట్టపల్లి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధిలో నాలుగు రోజులు నిర్వహించనున్న పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి అంకురారోపణతో ప్రారంభమయ్యాయి. తమిళనాడులోని శ్రీరంగం నుంచి శతాధిక యాగ కర్త ఎంఎల్ శ్రీనివాసన్ పంపిన పవిత్రాలను శ్రీస్వాతీ నక్షత్ర మహాయజ్ఞ వాటిక నుంచి ఆగమ ప్రవర బుర్రా వాసుదేవాచార్యులు నేతృత్వంలో ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చారణలతో ఆలయానికి చేర్చారు. తదుపరి ప్రార్థనా సూత్ర పఠనంతో పవిత్రోత్సవాలు నిర్విఘ్నంగా కొనసాగేలా శ్రీస్వామి అనుజ్ఞను స్వీకరించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం తదితర క్రతువులు పూర్తయ్యాక అఖండ దీపారాధన, పంచగవ్య ఆరాధనలు జరిగాయి. యాజ్ఞీక, యాజమాన్య దీక్షాధారణలు, రక్షాబంధనలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మేదినీ పూజతో పవిత్రోత్సవాలలో మొదటి రోజు కార్యక్రమాలు ముగిశాయి.

అండర్‌పాస్ పనుల్లో కదలిక

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న రైలుమార్గం అండర్‌పాస్ పనుల్లో కదలిక వచ్చింది. ఈ పనుల్లో అంతర్భాగమైన ఆర్సీ గోడల నిర్మాణం పూర్తి చేశారు. వాటిని రైలు మార్గం కింద ఏర్పాటు చేయాల్సి ఉండగా.. కొన్నేళ్ల నుంచి రకరకాల అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఎట్టకేలకు సోమవారం పనుల్లో ముందడుగు పడింది. రైలు పట్టాల కింద ఆర్సీ గోడలు ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో తాత్కాలికంగా గడ్డర్‌ను పెద్ద క్రేన్‌ల సాయంతో ఏర్పాటు చేశారు. దాని కింద మట్టిని తొలగించాల్సి ఉంది. ఇప్పటికే ఇరువైపులా రివిట్‌మెంటు వాల్, కింద సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దాదాపు రూ.5 కోట్లు వెచ్చించి ఈ పనులను చేపట్టారు. మొత్తం పనులు పూర్తయ్యేసరికి మరో రెండు నెలలు సమయం పట్టొచ్చని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

అర్హులకు తప్పనిసరిగా ఇళ్లు: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల్లో పనులు జరుగుతున్నాయని, అపోహలు నమ్మవద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన



సూర్యాపేట: ప్రజావాణిలో దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు వస్తాయని, మధ్యవర్తుల మాటలు నమ్మి ప్రతి సోమవారం ప్రజావాణికి రావొద్దని సూచించారు. ప్రస్తుతం మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయని, పూర్తి కాగానే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 70 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత, డీఆర్డీవో అప్పారావు, డీఎఫ్‌వో సతీష్ కుమార్, సీపీవో కిషన్, డీఎంహెచ్‌వో కోటా చలం, డీఈవో అశోక్, డీటీడీవో శంకర్ పాల్గొన్నారు.

2 నుంచి గ్రామసభలు


సూర్యాపేట కలెక్టరేట్: ఉపాధిహామీ 2025-26 సంవత్సరానికి సంబంధించి పని దినాల అంచనాలు రూపొందించి, లేబర్ బడ్జెట్‌ను గ్రామ పంచాయతీలలో ఆమోదం తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, ఈసీ, టీఏలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 2 నుంచి గ్రామ సభలు చేపట్టాలని పేర్కొన్నారు. నవంబరు 20 వరకు అన్ని పంచాయతీల్లో పనులను పర్యవేక్షించి కొలతలు తీసుకుని వాటిని గ్రామ పంచాయతీ ఆమోదం తీసుకోవాలని సూచించారు. తీర్మానాలను జిల్లా పరిషత్‌కు పంపించి లేబర్ బడ్జెట్ రూపొందించాలని తెలిపారు. డీఎఫ్‌వో సతీష్ కుమార్, డీఆర్డీవో అప్పారావు, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డీపీవో నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీ తేదీల్లో మార్పు

మునగాల, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలకు ఎంపిక తేదీల్లో మార్పు జరిగినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అజాంబాబా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1 తేదీన నిర్వహించాల్సిన ఎంపికలు అక్టోబరు 3న జిల్లా కేంద్రంలోని కుడకుడ రహదారిలోని ఎస్‌జీఎం క్రికెట్ అకాడమీలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైతేరాజు 8లో..

ఒడిసిపట్టాలంటే.. విడిచిపెట్టే..!



సూర్యాపేటలో నిర్మిస్తున్న ఇంకుడు గుంత

సూర్యాపేట పురపాలిక, నల్గొండ పురపాలిక, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. భవన నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు దర్శనమిస్తున్నాయి. జలసంరక్షణ మాత్రం ఎండమావిగానే మారుతోంది. నీటిబొట్టును ఒడిసిపట్టి భూమిలో ఇంకిపోయేలా చేసే చర్యలు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా, ప్రోత్సాహకాలు అందిస్తున్నా ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాల్లోని పురపాలికల్లో 2,36,550 గృహాలుండగా ఇప్పటి వరకు పది వేల ఇళ్లలోనే ఇంకుడుగుంతలు నిర్మించారు. దీంతో వాన నీరు వృథాగా పోతోంది.

తాజాగా ఆదేశాలు..

పట్టణాల్లో భూగర్భజలం తక్కువగా ఉన్నట్లు కేంద్ర జలశక్తిశాఖ విడుదల చేసిన నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. ఏటా కురుస్తున్న వర్షాలకు జల వనరులు నిండకపోగా. సహజసిద్ధంగా ఏర్పడిన వనరుల్లోనూ జలం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరుణంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో 300 చ.గజాల పైబడి ఉన్న స్థలాల్లో, అన్ని నిర్మాణాల్లో విధిగా ఇంకుడు గుంతలు తవ్వించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ విభాగాల్లో, ప్రైవేటు వాణిజ్య భవనాల సముదాయాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంకుడు గుంతలు తవ్వించకపోయినా, అవి పాడైపోయినా మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిబంధనలు ఇలా..

నిబంధనల ప్రకారం ఇంకుడుగుంత నిర్మాణానికి భవన నిర్మాణదారులు రూ.2,500 నుంచి రూ.నాలుగు వేల వరకు డిపాజిట్ చెల్లిస్తేనే ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తుంది. తవ్విన ఇంకుడుగుంతను పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి నిర్మాణం సవ్యంగా ఉంటేనే ముందుగా చెల్లించిన డబ్బులు తిరిగి యజమానికి చెల్లించే వెసులుబాటు ఉంది.

అటకెక్కిందిలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో ఈ ఏడాది సుమారు 4500 భవన నిర్మాణాలు ప్రభుత్వ అనుమతితో చేపట్టారు. అందులో ఒకటి రెండు శాతం మినహా నిర్మాణదారులు గుంతలు తవ్వించలేదు. భవన నిర్మాణాల అనుమతి పొందే సమయంలో ఉన్న ధ్యాస తర్వాత ఉండటం లేదు. ఇంకుడు గుంతలు తవ్వి ఒక్కరు కూడా డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారు లేరు. 2020 నుంచి ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ.2.13 కోట్ల నిధులు మూలుగుతున్నాయి.

పురపాలికల వారీగా వివరాలు

	సూర్యాపేట	నల్గొండ	యాదాద్రి
పురపాలికలు	5	8	6
నివాసాలు	82,340	92,420	61,790
డిపాజిట్లు(రూ.లక్షలు)	74	91	43

ఇంకుడు గుంత నిర్మిస్తేనే అనుమతులు

–శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. నూతనంగా ఇల్లు నిర్మించుకునే వారు ఇంకుడు గుంత నిర్మిస్తేనే అనుమతులు జారీ చేస్తాం. గుంత పూర్తయినట్లు మాకు ఆధారాలు చూపిస్తే డిపాజిట్లు తిరిగి చెల్లిస్తాం.

సూర్యాపేటలో హైడ్రా లేదు: పటేల్ రమేశ్‌రెడ్డి

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: అధికారుల అత్యుత్సాహంతోనే సద్దుల చెరువు పరిధిలో ఉన్న ఇళ్లకు మార్కింగ్ పెట్టారని రాష్ట్ర పర్యాటకరంగ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేటలో హైడ్రా లేదని, అది కేవలం ఓఆర్ఆర్ పరిధిలో మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సూర్యాపేటలో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా చూసే బాధ్యత నాదేనని హామీ ఇచ్చారు. రమణారెడ్డి, రామ్మూర్తి, ఎండీ షఫి ఉల్లా, గట్టు శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.



సూర్యాపేట: మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

భయాందోళనలు సృష్టించొద్దు: ఆర్డీఆర్

సూర్యాపేట పట్టణం: సర్వే, మార్కింగ్ పేరుతో అధికారులు పట్టణ ప్రజల్లో భయాందోళనలు సృష్టించొద్దని మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైడ్రా హైదరాబాద్ వరకే పరిమితమని, జిల్లాలో చర్యలు చేపట్టే అధికారం హైడ్రాకు లేదని స్పష్టం చేశారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు.

డీఎస్సీ అభ్యర్థుల్లో కొలువుల కళ

- వెల్లడైన ఫలితాలు
- జిల్లా వ్యాప్తంగా భర్తీ కానున్న 386 పోస్టులు
- నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: డీఎస్సీ- 2024 ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వం జులై, ఆగస్టు నెలల్లో డీఎస్సీ పరీక్ష నిర్వహించి సోమవారం ఫలితాలు ప్రకటించింది. మొదటి సారి ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్ష ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1268 పోస్టులు భర్తీ చేయనున్నారు. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 386, యాదాద్రి భువనగిరిలో 277 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రభుత్వం పరీక్ష నిర్వహించి తక్కువ సమయంలో ఫలితాలు వెలువరించడంపై అభ్యర్థుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మధ్యాహ్నం ఫలితాలు ప్రకటించాక అధికారిక వెబ్‌సైట్ సర్వర్ పని చేయకపోవడంతో అభ్యర్థులు కొంత ఇబ్బంది పడ్డారు.

1158 మంది అభ్యర్థులకు సమాచారం

డీఎస్సీ ఫలితాల మెరిట్ జాబితాలోంచి ఒక పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల చొప్పున ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు డీఈవో అశోక్ కుమార్ తెలిపారు. మెరిట్ అభ్యర్థులకు రిజిస్టరైన చరవాణి నెంబర్‌కు సమాచారం వస్తుందని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 5 వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్, రెండు జతల నకలు కాపీలతో హాజరు కావాలని తెలిపారు. విద్యాశాఖ విడుదల చేసిన జిల్లా పరిధిలో 386 పోస్టులకు గాను 1158 మందిని ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సిన సంక్షిప్త సమాచారం అందించినట్లుగా తెలిసింది.

ఉత్తమ ప్రతిభ



కందిమళ్ల రవి

నడిగూడెం: పేద కుటుంబం, తల్లి దండ్రులు కూలి పనులు చేస్తుంటారు. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొన్నారు. డీఎస్సీ సోషల్ స్టడీస్ విభాగంలో 86.40 మార్కులు పొంది జిల్లాలోనే మొదటి ర్యాంకు సాధించారు నడిగూడెం మండలం శ్రీరంగాపురానికి చెందిన కందిమళ్ల రవి. ఇటీవల వెలువడిన గురుకుల ఉద్యోగ నియామకాల్లో టీజీటీ ఉద్యోగం పొందారు. ప్రస్తుతం టీజీటీగా పనిచేస్తూ, డీఎస్సీ రాసినట్టు చెప్పారు. తొలి ప్రయత్నంలోనే జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన రవిని స్థానికులు, బంధువులు, కుటుంబ సభ్యులు అభినందించారు. తన తల్లి దండ్రుల కష్టం చూసి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో శిక్షణ లేకుండా పోటీ పరీక్షలకు సిద్ధమైనట్లు చెప్పారు.

ఎస్జీటీ విభాగంలో భార్యాభర్తలు

మునగాల గ్రామీణం: నర్సింహులగూడెం గ్రామానికి చెందిన ఉయ్యాల నరేందర్ ఎస్జీటీ విభాగంలో 87.5 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంక్ సాధించారు. 2019లో రైల్వే విభాగంలో గ్రూప్-డి ఉద్యోగానికి ఎంపికై ప్రస్తుతం గుంటూరు జిల్లా దాచేపల్లి వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఓ వైపు ఉద్యోగం చేసుకుంటూనే డీఎస్సీకి సన్నద్ధమైనట్లు తెలిపారు. అలాగే అతని భార్య కల్యాణి ఎస్జీటీ విభాగంలో 78.6 మార్కులు సాధించి యాదాద్రి-భువనగిరి జిల్లాలో రెండో ర్యాంకు సాధించినట్లు తెలిపారు. భర్త ప్రోత్సాహంతోనే ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆమె చెప్పారు.



నరేందర్, కల్యాణి

దసరాకు 448 ప్రత్యేక బస్సులు

- నేటి నుంచి ఈ నెల 16 వరకు పండగ సర్వీసులు



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్

మిర్యాలగూడ పట్టణం, నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సమాయత్తమైంది. ఈ నెల 1 నుంచి 11 వరకు (3, 4, 8 తేదీలు మినహా) 448 బస్సులు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 13 నుంచి 16 వరకు 191 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రత్యేక బస్సులన్నీ ఉమ్మడి జిల్లాలోని డిపో కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నడిపేందుకు సిద్ధమయ్యారు. మహాలక్ష్మి పథకంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగగా.. దసరా రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ అన్ని రకాల చర్యలు చేపట్టింది.

ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ప్రత్యేక బస్సుల వివరాలు..

ప్రత్యేక బస్సులు	డిపో	తిరుగు ప్రయాణంలో
74	నల్గొండ	30
37	నార్కట్‌పల్లి	12
84	మిర్యాలగూడ	34
45	కోదాడ	14
87	సూర్యాపేట	37
62	దేవరకొండ	32
59	యాదగిరిగుట్ట	32


11న అత్యధికంగా సర్వీసులు

ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఈ నెల 11న అత్యధికంగా 125 బస్సులు నడుపనున్నారు. ఈ బస్సులు నల్గొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట డిపోల నుంచి హైదరాబాద్ వరకు, దేవరకొండ డిపో నుంచి ఐఎస్ సదన్ వరకు, యాదగిరిగుట్ట డిపో నుంచి ఉప్పల్ క్రాస్‌రోడ్డు వరకు నడవనున్నాయి. వీటితో పాటు ఆయా డిపోల నుంచి నిత్యం తిరిగే 516 సర్వీసులు యథావిధిగా నడవనున్నాయి.

రద్దీకి అనుగుణంగా..

–రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ

దసరా, బతుకమ్మ పండగల సందర్భంగా మొత్తం 639 ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధమయ్యాం. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని అదనపు సర్వీసులు సైతం నడిపేందుకు సన్నద్ధంగా ఉన్నాం. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎల్బీనగర్, హయత్‌నగర్ వంటి రద్దీ ప్రదేశాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నాం.



ప్రత్యేక బస్సుల వివరాలు తెలుసుకునేందుకు సంప్రదించాల్సిన నంబర్లు..

డిపో	ఫోన్ నంబర్
మిర్యాలగూడ	08689-241111
నల్గొండ	86822 93622
సూర్యాపేట	73829 43819
సూర్యాపేట (హైటెక్ బస్టాండ్)	94949 26625
కోదాడ	99592 26302
నార్కట్‌పల్లి	98485 84198
దేవరకొండ	94905 10752
యాదగిరిగుట్ట	73828 36087

రైతేరాజు

బొప్పాయిలో తెగుళ్ల నివారణ

గరిడేపల్లి, న్యూస్‌టుడే: బొప్పాయిలో పలు తెగుళ్లు ఆశించి తోటలో మొక్కలకు తీవ్ర నష్టం కల్గిస్తున్నాయని వెంటనే సరైన సస్యరక్షణ చేపట్టాలని ఉద్యాన విభాగం శాస్త్రవేత్త సీహెచ్. నరేష్ సూచించారు.



వేరుకుళ్లు సోకిన బొప్పాయి

కాండం కుళ్లు వ్యాధి సోకితే వేర్ల మొదలు మెత్తగా మారి కుళ్లిపోతాయి. నివారణకు మొక్క ప్రారంభ భాగంలో నీరు నిల్వఉండకుండా చూడాలి. బోర్డో మిశ్రమం 1 శాతం పూయాలి. లేదా కాపర్‌సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మొక్కల మొదలు తడపాలి. బూడిద తెగులు ఆశిస్తే ఆకులు కాడలు కొత్త చిగుళ్లపైన తెల్లటి బూడిదలాంటి శిలీంధ్రపు పెరుగుదల కన్పిస్తుంది. నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా కెరాథీన్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పంటల మార్పిడి.. లాభాల జడి

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రతిసారి ఒకే రకమైన పంటను సాగు చేయటంతో దిగుబడులు తగ్గి అన్నదాత నష్టాలను చవిచూస్తున్నాడు. రోజురోజుకు భూగర్భ జలం అడుగంటుతున్న తరుణంలో.. మారుతున్న కాలానికి అనుగుణంగా కొందరు రైతులు పంట మార్పిడి పద్ధతిని అనుసరిస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ యువ రైతు కూరగాయలు పండిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

★ వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. చింతపల్లి గ్రామానికి చెందిన శివర్ల రమేష్‌కు గ్రామంలో మూడెకరాల భూమి ఉంది. గతంలో పత్తి సాగు చేస్తూ వచ్చారు. పెట్టుబడి అధికమవటం.. దిగుబడి తక్కువ రావటం.. కూలీల కొరత కారణంగా ఏటా నష్టాలు వచ్చాయి. నష్టాల నుంచి గట్టెందుకు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు వైపు మొగ్గు చూపాడు.



చింతపల్లిలో దొండతోటను సాగు చేస్తున్న శివర్ల రమేష్





కూరగాయల పంటలు

రూ.15 వేల పెట్టుబడితో..

రమేశ్ గతేడాది తన కున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో దొండ, వంకాయ, టమాట, బెండ తోటను సాగు చేశారు. ప్రతి పంటకు రూ.15 వేల పెట్టుబడి పెట్టి సాగు చేయగా.. దిగుబడి సకాలంలో అందటంతో చింతపల్లి, హైదరాబాద్ మార్కెట్‌లకు తెల్లవారుజామున ఆటోలో తీసుకెళ్లి విక్రయించడంతో లాభాలొచ్చాయి. ఒక్క పంట మీద సుమారు రూ.50 వేలకు పైగా లాభం వచ్చింది. ప్రస్తుతం బెండ, బీర, పచ్చిమిర్చి, సొరకాయ పంటలను వేశారు.

రూ. 4 లక్షలతో పందిరి

ఎకరంలో రూ.4 లక్షల వ్యయంతో డ్రిప్, రాతి కడీలను ఏర్పాటు చేసి.. దొండ తోటలను క్రమం తప్పకుండా సాగు చేస్తున్నారు. ఈ పందిరి సుమారు 20 ఏళ్ల వరకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఉన్న భూమితోపాటు సమీప బంధువులకు చెందిన మరో ఐదు ఎకరాలకుపైగా పత్తి పంటలను సాగు చేస్తే పెట్టుబడులు సైతం రాకపోవడంతో సొంత ఆలోచనతో కూరగాయాల సాగు చేస్తున్నాను. మొదట్లో కూరగాయల సాగు చేయడంతో పెట్టుబడి కంటే అధిక దిగుబడులు రావడంతో మూడు సంవత్సరాలుగా పంటలు సాగు చేయడంతో సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం వచ్చింది.

పత్తిలో సూక్ష్మధాతు లోపాలు

త్రిపురారం, న్యూస్‌టుడే: పత్తిలో సూక్ష్మధాతు లోపాలు, సవరణ గురించి కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు తెలియజేశారు. మెగ్నీషియం లోప లక్షణాలు ముదురు ఆకులు, అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగుకు మారతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలి పోతాయి. ఈ లోపం పొటాషియం ఎక్కువగా ఉన్న నేలల్లో సాధారణంగా కనిపిస్తుంది. మెగ్నీషియం లోప నివారణకు లీటరు నీటికి 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ పైరు వేసిన 45, 75 రోజుల తరువాత రెండు సార్లు పిచికారీ చేయాలి.

జింకు: పత్తిలో జింకు ధాతువు లోపం వల్ల ఆకుల ఈనెలు పచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం మాత్రమే పసుపు పచ్చగా మారుతుంది. నివారణకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను దుక్కిలో వేసుకోవాలి. 0.2 శాతం జింకు సల్ఫేట్ ద్రావణాన్ని 2 గ్రా. లీటరు నీటికి పిచికారీ చేయాలి.

బోరాన్: పత్తిలో బోరాన్ లోపమున్నప్పుడు పూల స్వరూపం మారి ఆకర్షణ పత్రాలు చిన్నవై లోపలికి ముడుచుకుపోతాయి. ఆకులు కాడలు ఒకే రీతిన ఉండక కొంత దళసరిగాను, కొంత పలుచగాను ఉండి అక్కడక్కడ రింగుల మచ్చలు ఏర్పడతాయి. బోరాన్ లోప నివారణకు పైరు వేసిన 60, 90 రోజుల తరువాత లీటరు నీటికి 1.5 గ్రా. బోరాక్స్ వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

సమస్య - సమాధానం

? వరిలో సుడిదోమ గురించి తెలపండి.
- నరసింహారావు, అనుముల

సమాధానం: నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనిపిస్తాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చటం వల్ల పైరు సుడులతో ఎండిపోవటం, తాలు గింజలు ఏర్పడటం జరుగుతుంది. నివారణకు క్లోరిపైరిఫాస్, ప్రొఫెనోఫాస్, లామ్డా సైహలోథ్రిన్ పిచికారీ చేసుకోవాలి. పొలంలో నీటిని తగ్గించి మొక్కల మొదళ్లపై పిచికారీ చేయాలి.

? కందిలో ఎండు తెగుళ్ల లక్షణాలు, నివారణ గురించి తెలపండి.
- రమణారెడ్డి, పెద్దదేవులపల్లి

సమాధానం: తెగులు సోకిన మొక్కలు పూర్తిగా లేదా కొంతభాగం వాడి ఎండిపోతాయి. వాటిని పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. తెగులు అధికంగా కనిపించిన పొలాల్లో పొగాకు లేక జొన్నతో పంట మార్పిడి చేయాలి. నివారణకు మందులు లేవు. నీరు నిల్వ ఉండే భూముల్లో సాగు చేయకూడదు.

? బంతి పంటలలో నత్తల, నివారణ గురించి తెలపండి.
- అనంతుల వెంకటేష్, ఎర్రపాడ్

సమాధానం: నత్తలను సేకరించి సాధారణ ఉప్పు ఉన్న బకెట్‌లో ఉంచాలి. నత్తలు రాత్రి సమయాల్లో చురుకుగా ఉంటాయి. వాటిని సేకరించడం ప్రధాన సమస్య. ఇంటి తోటల్లో సాధారణ ఉప్పుతో భౌతిక అవరోధం ఉంచటం. నివారణకు మెటల్డిహైడ్ 2.5 శాతం బైట్ ఎకరానికి 2 కిలోల చొప్పున ఉపయోగించాలి. మొక్కల దగ్గర చిన్న పరిమాణంలో నత్త పురుగుల ఎరలను 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 50, 80 గ్రా. ఉంచాలి.

- త్రిపురారం, న్యూస్‌టుడే


రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్:




కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు

77025 44771

శాకాహారం, మాంసాహారానికి ఇస్తున్న ప్రాధాన్యంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వే వివరాలు..







సాత్వికాహారం.. దీర్ఘాయుష్షుకు మార్గం



శాకాహారంపై పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ(పాత చిత్రం)

వివిధ ఆహార పదార్థాల్లో పోషకాల వివరాలు(వంద గ్రాముల పరిమాణంలో)

పదార్థం	ప్రొటీన్లు	పిండి పదార్థాలు	కేలరీలు
మేక మాంసం	21.4	-	118
చేపలు	76	9.0	413
కోడి మాంసం	24	-	132
కోడి గుడ్డు	6	1	73
సోయాబీన్స్	52	33	349
వేరుసెనగలు	19	61	374
బాదంపప్పు	20.8	10.5	655
గేదెపాలు	4.3	5.0	117
పెరుగు	3	4	55

సోయాబీన్స్(3.7), వేరుసెనగలు(3.1), బాదం పప్పు(1.7) మాత్రమే పీచు పదార్థాలు ఉంటాయి

❖ నేడు 'ప్రపంచ శాకాహార దినోత్సవం'

ధార్మిక సంస్థల సేవలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 లక్షలకు పైగా జనాభా ఉండగా.. వీరిలో 80 శాతం మంది ఏదో ఒక సందర్భంలో మాంసాహారం తినే వారు ఉంటారని అంచనా. కరోనా కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాంసాహారం తినే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం శాకాహారానికి మారుతున్న వారి సంఖ్య పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. శాకాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు పిరమిడ్ ధ్యాన కేంద్రం, శ్రీ రామ చంద్ర మిషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థలు ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటారు. కానీ, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. గతంలో ఎప్పుడో పండగలు, శుభకార్యాలకు మాత్రమే తినే మాంసాహారం ప్రస్తుతం రోజువారీ భోజనంలో భాగమైంది. సాత్వికాహారమైన శాకాహారం ప్రాముఖ్యాన్ని వివరించేందుకు ఏటా అక్టోబరు ఒకటో తేదీన 'ప్రపంచ శాకాహార దినోత్సవం' నిర్వహిస్తున్నారు.



శరీరం తేలికగా ఉంది: పల్‌రెడ్డి కృష్ణారెడ్డి, మిర్యాలగూడ

అనారోగ్యం కారణంగా 2020లో మాంసాహారం తినడం తాత్కాలికంగా మానేశాను. శాకాహారం తినడం వల్ల మనసు, శరీరం తేలికగా ఉన్నట్లు అనిపించడంతో ఇంతవరకు గుడ్డు కూడా ముట్టుకోలేదు. నిత్యం పప్పులు, ఆకుకూరలు, అన్ని రకాల కూరగాయలు తినడం వల్ల ప్రస్తుతం నా వయసు 50 ఏళ్లు దాటినా ఆరోగ్యంగా ఉన్నాను.

శరీరతత్వాన్ని బట్టి ఆహారం

–వేజెండ్ల జాహ్నవి, న్యూట్రిషనిస్ట్, మిర్యాలగూడ

మాంసాహారం కంటే శాకాహారమే మేలని నిపుణులు చెబుతున్నప్పటికీ శరీరతత్వాన్ని బట్టి ఒక్కొక్కరికి ఒక్కో ఆహారాన్ని సిఫారసు చేస్తుంటాం. మాంసాహారంలో అత్యధిక ప్రొటీన్ ఉండడం వల్ల.. అది అవసరమయ్యే వారికి మాంసాహారం తీసుకోవాలని చెబుతాం. శాకాహారంలోనూ ప్రొటీన్లు లభించే పదార్థాలు ఉన్నాయి. వీటిలో సోయా, వేరుసెనగలు వంటివి ఉన్నాయి. మాంసాహారులతో పోలిస్తే గుండెజబ్బులు, గుండెపోటు వల్ల వచ్చే మరణాలు శాకాహారుల్లో తక్కువగానే నమోదవుతున్నాయి.



గేదెల బీమా పత్రానికి లంచం వసూలు

నగదు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పశువైద్యాధికారి

చింతపల్లి, న్యూస్‌టుడే: రాయితీ రుణం తీసుకొని గేదెల ఫాం పెట్టుకోవడానికి అవసరమైన ఆరోగ్య, బీమా ధ్రువీకరణ పత్రాల కోసం రైతుల నుంచి లంచం వసూలు చేసిన మండల పశువైద్యాధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు, అధికారులు తెలిసిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నసర్లపల్లి గ్రామానికి చెందిన రాసిక వినోద్, రాసిక కుమార్ అనే ఇద్దరు రైతులు పీఎంఈజీపీ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రాయితీపై రూ.20లక్షల రుణం తీసుకొని ఎనిమిది గేదెలను కొనుగోలు చేశారు.



జోసెఫ్ పాల్

మొదటి విడతగా రూ.10లక్షల రుణం మంజూరు చేశారు. రెండో విడత రుణం కావాలంటే పశువైద్యాధికారుల నుంచి గేదెలకు బీమా, ఆరోగ్య ధ్రువపత్రం తీసుకురావాలని బ్యాంకు అధికారులు సూచించారు. దీంతో వీరిద్దరూ మండల పశువైద్యాధికారి జోసెఫ్ పాల్‌ను సంప్రదించారు. గేదెలకు విలువ, బీమా, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటే ఆయన రూ.20వేల లంచం అడిగాడు. అంత మొత్తం ఇవ్వలేమని పలుమార్లు వైద్యాధికారిని వేడుకున్న స్పందన లేదు. దీంతో చేసేదేమీ లేక రూ.8 వేలు ఇస్తామని చెప్పి, సోమవారం డబ్బులు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జోసెఫ్ పాల్‌కి రూ.6వేల లంచం ఇస్తుండగా అప్పటికే నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకొని కస్టడీలోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చంద్ర తెలిపారు. పాల్ ఇంటిపై దాడులు కొనసాగిస్తామని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబరు 1064 సమాచారం అందించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ రామారావు, వెంకట్‌రావు, సిబ్బంది ఉన్నారు.

▶ వృద్ధులకు ఆర్థిక భద్రత, ఆరోగ్య రక్షణ, నివాస వసతి ప్రధానమైనవి. వీటిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 అమలులోకి తెచ్చింది. ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా ఆర్డీవోలు నియమితులయ్యారు. వారు వృద్ధుల నుంచి దరఖాస్తులు స్వీకరించి విచారణ నిర్వహించి పోషణ కోసం తీర్పులు వెలువరిస్తున్నారు.

▶ వృద్ధుల కోసం జాతీయ స్థాయిలో 'హెల్ప్‌లైన్' ను ప్రకటించారు. టోల్‌ఫ్రీ నెంబరు: 14567

ప్రశాంతంగా శేషజీవితం గడపాలని...

నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: దిక్కుమొక్కు లేనివారు వృద్ధాప్యంలో శేషజీవితాన్ని ప్రశాంతంగా గడిపేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా పెద్దకొండూరులో వానప్రస్థాశ్రమాన్ని నిర్మించారు మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ దంపతులు. ఎకరం విస్తీర్ణంలో ఇరవై గదులతో ప్రశాంతమైన వాతావరణంలో కోటి రూపాయలు తమ సొంత డబ్బు వెచ్చించి వారు ఈ ఆశ్రమం కట్టారు. నిరాశ్రయులైన వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించి నిర్వహించే ఒప్పందంతో ఈ వానప్రస్థాశ్రమాన్ని, ఎకరం భూమిని రెడ్‌క్రాస్ సంస్థకు స్వాధీనం చేస్తూ రాష్ట్ర గవర్నర్ పేరిట దానపత్రాన్ని వారు అందజేశారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో హైదరాబాద్‌కు చెందిన 'సాయి యాదాద్రి సేవా ఆశ్రమం' ఆధ్వర్యంలో 2020 నుంచి నిర్వహిస్తున్నారు. ఇందులో యాభై మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. వారికి నాణ్యమైన భోజనం, వస్త్రాలు, ఈ ఆశ్రమంలో నిర్వహిస్తున్న గోశాలలోని ఆవు పాలు, పెరుగును ఆశ్రమవాసులకు అందిస్తున్నారు. మానసిక ప్రశాంతత కోసం సాయంత్రం భజన, సత్సంగం నిర్వహిస్తున్నారు. ఉదయం ధ్యానం, యోగా సాధన చేయిస్తారు. గ్రంథాలయం ఏర్పాటు చేశారు. వంద మంది వృద్ధులకు సరిపడేంత వసతి పెంచేందుకు ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన రూ.50లక్షలు, దాతల విరాళాలతో వసతిగృహం నిర్మిస్తున్నారు. 'దాతల నుంచి ఇప్పటి వరకు రూ.1.25 కోట్ల విరాళాలు సమకూరాయని, ఆ నిధులతో నాలుగేళ్లుగా వానప్రస్థాశ్రమాన్ని సేవాభావంతో నిర్వహిస్తున్నామ'ని సాయియాదాద్రి సేవాశ్రమం అధ్యక్షుడు దెబ్బటి అశోక్, కార్యదర్శి కేవై శెట్టి తెలిపారు.



చౌటుప్పల్ మండలం పెద్దకొండూరులో మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మలు నిర్మించిన వానప్రస్థాశ్రమం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కూలీల దుర్మరణం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఇద్దరు వలస కూలీలు మృతి చెందారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మయూర్‌బంజ్ ప్రాంతానికి చెందిన రాజు కిశోర్ సింగ్(39), బాసొతా బాగుడి(21), ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మనిష్ కుమార్‌వర్మలు గత కొంత కాలం నుంచి దండుమల్కాపురం గ్రామ శివారులోని క్రషర్‌లో పని చేస్తున్నారు. క్రషర్ సమీపంలో క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటారు. వీరు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుండటంతో దండుమల్కాపురం గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు వెళ్లారు. అక్కడ ఆయన లేకపోవడంతో చౌటుప్పల్ ఆసుపత్రికి వస్తుండగా.. ఐవోసీఎల్ టెర్మినల్ ఎదురుగా వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు కిశోర్ సింగ్, బాసొతా బాగుడి మృతి చెందారు. మనిష్ కుమార్ వర్మ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతదేహాలకు చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై యాదవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 13 గ్రానైట్ లారీల పట్టివేత

కోదాడ న్యూస్‌టుడే: అక్రమంగా గ్రానైట్ రాయిని తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికారులు పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైనింగ్ అధికారుల కథనం ప్రకారం.. అనంతగిరి మండలం బొజ్జగూడెం పరిధిలో కోదాడ మండలంలోని చిమిర్యాల మిడ్‌వెస్ట్ కంపెనీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 13 లారీల్లో గ్రానైట్ రాయిని ఖమ్మం జిల్లాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో మొదటగా 6 లారీలు పట్టుకోగా, తర్వాత మరో 7 లారీలను అదుపులోకి తీసుకున్నారు. చలానాలు చెల్లించేవరకు సీజ్ అయిన వాహనాలను కోదాడ పట్టణ పరిధిలో భద్రపరిచారు. అనుమతి లేకుండా గ్రానైట్‌ను తరలిస్తుండగా గ్రానైట్‌ను సీజ్ చేసి రూ.15 లక్షలకు పైగా జరిమానా విధించామని మైనింగ్ జిల్లా అసిస్టెంట్ జియాలజిస్ట్ విజయరామరాజు తెలిపారు. అధిక లోడుతో వెళ్తున్నందున వాహనాలను సీజ్ చేశామని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గిలాని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ సిబ్బంది రామ్మూర్తి, వెంకన్న, శ్రీనివాస్, తదితరులు తెలిపారు.



పట్టుకున్న గ్రానైట్ లారీలు

స్నేహితుడి కారు కోసం వెళ్లి.. కానరాని లోకాలకు

కోదాడ, వేములపల్లి, చిలుకూరు, న్యూస్‌టుడే: స్నేహితుడికి కారు కొనాలని మరో ఇద్దరు స్నేహితులు తోడుగా వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారానికి చెందిన మల్లికంటి దినేశ్(22) అనే వ్యక్తి మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామంలో బేకరీ దుకాణం నడుపుతున్నాడు. దసరా పండగకు ఆఫర్లు ఉంటాయని నూతన కారు కొనేందుకు తన స్నేహితులైన వేములపల్లి మండలం మొలకపట్నం గ్రామానికి చెందిన వలపుదాసు వంశీ(22), మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన అభిరాళ్ల శ్రీకాంత్(21) అనే ఇద్దరు స్నేహితులను తీసుకొని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి వచ్చాడు. కారు కొనేందుకు ఓ షోరూంనకు వెళ్లి ముందస్తుగా కొంత డబ్బులు చెల్లించి, అనంతరం స్వగ్రామాలకు ముగ్గురు స్నేహితులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చిలుకూరు మండలం మిట్స్ కళాశాల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు, లారీ మధ్యలో నుంచి వెళ్లడంతో లారీని ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలాన్ని కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి పరిశీలించారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు చిలుకూరు ఎస్సై రాంబాబుగౌడ్ తెలిపారు.



వలపుదాసు వంశీ



మల్లికంటి దినేశ్



శ్రీకాంత్

2 నెలల వ్యవధిలోనే తండ్రీ కుమారుల మృతి..

తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి ఉండే బాధ మాటల్లో వర్ణించలేం. అలాంటి కుటుంబంలో తండ్రి మరణించినట్లుగానే ఏకైక కుమారుడు కూడా రోడ్డు ప్రమాదంలో మరణిస్తే అలాంటి ఘటనను ఊహించుకుంటేనే భయమేస్తుంది. కానీ అలాంటి ఘటనే త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారానికి చెందిన మల్లికంటి దినేశ్ కుటుంబానిది. 2 నెలల వ్యవధిలోనే భర్త శ్రీనివాస్, కుమారుడిని కోల్పోయిన ఆ తల్లి(పార్వతమ్మ) శోకం తీరనిది. దీంతో గ్రామంలో విషాధ చాయలు అలుముకున్నాయి.

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

ప్రాణదాతలు

వైద్యులు వ్యతిరేకించినా పట్టువీడలేదు

–పులిజాల శ్రీదేవి, నల్గొండ

హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తాను. రెండేళ్ల క్రితం నా భర్తకు అనారోగ్యం కారణంగా రక్తం అవసరం కాగా.. నేను ఇచ్చేందుకు ముందుకు వచ్చాను. మహిళనన్న కారణంతో నా నుంచి రక్తం సేకరించేందుకు వైద్యులు నిరాకరించారు, అయినా పట్టువీడకపోవడంతో ఒప్పుకున్నారు. అలా తొలిసారిగా రక్తదానం చేశాను. నాది బీ పాజిటివ్. ఇప్పటి వరకు 11 సార్లు రక్తదానం చేశాను.



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేయడంతో ప్రాణాలు దక్కించుకున్న వారు అనేక మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో సరిపడా రక్త నిల్వ కేంద్రాలు లేకపోవడంతో బాధితులకు ఒక్కోసారి సకాలంలో రక్తం అందని పరిస్థితులు నెలకొంటున్నాయి. పలువురు యువత ముందుకొచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో పాటు తమ స్నేహితుల ద్వారా దానం చేయిస్తూ ఆపత్కాలంలో ఆదుకుంటున్నారు. ఇటీవల మహిళలు సైతం ముందుకువస్తున్నారు. నేడు 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం' సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం...

☛ నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

రక్త నిల్వ కేంద్రాలు కరవు..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా ఆసుపత్రులతో పాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండలోని ప్రభుత్వ దవాఖానాల్లో రక్తనిల్వ కేంద్రాలు ఉన్నాయి. నల్గొండలో మూడు, మిర్యాలగూడలో రెండు, సూర్యాపేటలో ఒకటి, నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రిలో ఒకటి చొప్పున ప్రైవేట్ ఆధ్వర్యంలోని రక్త నిల్వ కేంద్రాలు ఉన్నాయి. నల్గొండ జిల్లా పరిధిలో 60 మంది తలసీమియా, సికిల్‌సెల్ బాధితులు ఉన్నారు. వీరికి అవసరాన్ని బట్టి ఒక్కొక్కరికి నెలకు ఒకటి నుంచి ఐదు యూనిట్ల రక్తం అవసరం. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రక్తనిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

21 సార్లు రక్తదానం చేశాను:

–కస్తూరి సురేష్, ఇంటీరియర్ డిజైనర్, కోదాడ



నాది ఏబీ పాజిటివ్ గ్రూపు రక్తం. రక్తం లేక ప్రాణాలు కోల్పోతున్నారనే వార్తలు చూసి చలించి.. 2016లో తొలిసారి రక్తదానం చేశాను. ఇప్పటి వరకు మొత్తం 21 సార్లు రక్తదానం చేశాను. దీని కోసం మెగా బ్లడ్ డొనేషన్ ట్రస్టు పేరుతో సంస్థను, వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేశాను. దీని ద్వారా సుమారు రెండు వేల మందికి పైగా రక్తదానం చేయించాను. రెండేళ్ల క్రితం ఓ చిన్నారికి అత్యవసర సమయంలో విజయవాడ వెళ్లి రక్తదానం చేయగా.. ఆ కుటుంబ సభ్యులు దేవుడిలా చూడటం మరచిపోలేని అనుభూతి. జనయేత్రి ఫౌండేషన్ మిర్యాలగూడ, సిరి రక్తనిల్వ కేంద్రం, ఖమ్మం నుంచి అవార్డులు సైతం అందుకున్నాను.

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడ పట్టణంలోని పలు కేంద్రాలలో తయారు చేసిన దుర్గామాత విగ్రహాలను తరలించేందుకు ముస్తాబు చేస్తున్నారు. హుజూర్‌నగర్ గ్రామీణం: మండలంలోని పలు గ్రామాల్లో నవ రాత్రి ఉత్సవాల నిర్వహించేందుకు మండపాలను సిద్ధం చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.


తరలించేందుకు సిద్ధంగా ఉన్న దుర్గామాత విగ్రహాలు

హామీలు నెరవేర్చాలి

కోదాడ పట్టణం: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని భాజపా యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రౌతు కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే భాజపా యువమోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? కోదాడ పట్టణంలోని బ్రహ్మంగారి వీధిలో విద్యుత్తు దీపం వెలగడం లేదు. –అన్వర్, కోదాడ

✔ వెంటనే పరిశీలించి వీధి దీపం అమర్చుతాం. –జాని, ఎలక్ట్రీషియన్, పురపాలక సంఘం, కోదాడ

మేళ్లచెరువు, న్యూస్‌టుడే:

? ఎన్నెస్పీ కాల్వలో చెత్తాచెదారం వేస్తున్నారు. దుర్గంధం వస్తోంది. – వెంకటరెడ్డి, మేళ్లచెరువు

✔ ఎవరూ కాల్వలో చెత్తాచెదారం వేయొద్దు. ఇంటి దగ్గర్లోని ఖాళీ ప్రదేశంలో వేస్తే మా సిబ్బంది వచ్చి తీసుకెళ్తారు. – ఫరీద్, పంచాయతీ కార్యదర్శి, మేళ్లచెరువు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు


హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ముందస్తు బతుకమ్మ వేడుకలు జరుపుకొన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ బతుకమ్మ పండగ విశిష్టతను, ప్రాధాన్యాన్ని వివరించారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల విజయదుర్గ ఆలయం వద్ద బుధవారం ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ అరిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న సద్దుల బతుకమ్మ రోజు అందంగా పేర్చిన బతుకమ్మలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

కోదాడ పట్టణం: బతుకమ్మ పండగను ఘనంగా జరుపుకుందామని పుర ఛైర్‌పర్సన్ ప్రమీల అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న బతుకమ్మ ఏర్పాట్లను సోమవారం ఆమె పరిశీలించారు. లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

స్ఫూర్తి ప్రదాతలు

☛ నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

మనిషి కృత్రిమంగా తయారు చేయడానికి సాధ్యంకాని సంజీవని రక్తం. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యకరమైన వ్యక్తి రక్తదానం చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కొంతమంది యువకులు ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందిస్తూ పలువురు ప్రాణాలు కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. – కోదాడ పట్టణం, న్యూస్‌టుడే


రక్తదానం చేస్తున్న ఓరుగంటి కిట్టు

48 సార్లు రక్తదానం చేశా:
– ఓరుగంటి కిట్టు, చిలుకూరు

చిన్నప్పటి నుంచే రక్తదానం చేస్తున్నాను. అత్యవసర పరిస్థితిలో ఒకరికి రక్తం కావాలని అడిగిన సమయంలో మొట్టమొదట రక్తదానం చేశాను. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం ఇచ్చి ఆపదలో ఉన్న వారికి, శస్త్రచికిత్స కోసం, ప్రమాదాలు జరిగిన వారికి రక్తాన్ని అందిస్తున్నాను. ఇప్పటి వరకు 48 సార్లు చేశాను.

అవగాహన కల్పిస్తున్నా:
– నాగుబండి శ్రీనివాసరావు, వైద్యుడు, కోదాడ

నా గ్రూపు ఓ పాజిటివ్. నేను ప్రత్యేకంగా వైద్యుడిని కావడంతో అవసరమని తెలిస్తే చాలు వెంటనే రక్తాన్ని అందిస్తున్నాను. స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రూపు ఏర్పాటు చేశారు. అందులో మెసేజ్ వచ్చిన వెంటనే వెళ్లి రోగులకు రక్తాన్ని ఇచ్చి ప్రాణాలు కాపాడుతున్నా. పలువురికి అవగాహన కల్పిస్తున్నా. నా స్నేహితులకు, బంధువులకు రక్తదానం చేయాలని సూచిస్తున్నాను.



ట్రస్టు ఆధ్వర్యంలో:
– గాదంశెట్టి శ్రీనివాసరావు, స్వర్ణభారతి ట్రస్టు అధ్యక్షుడు, కోదాడ

స్వర్ణభారతి ట్రస్టు ఆధ్వర్యంలో అనేక మందికి రక్తాన్ని అందిస్తున్నాం. వివిధ ప్రాంతాలకు వెళ్లి అవసరం ఉన్నవారికి ఇస్తున్నాం. ప్రధానంగా శస్త్రచికిత్సలు, తలసేమియా, ప్రమాదాలు జరిగి రక్తం లేక ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకుంటున్నాం. ఇప్పటి వరకు నేను 28 సార్లు రక్తాన్ని ఇచ్చా. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడిని కావడంతో వెంటనే స్పందించి అందరి ద్వారా రక్తాన్ని ఇప్పిస్తున్నా.



శిథిలావస్థలో బడి

చిలుకూరు, న్యూస్‌టుడే: కట్టకొమ్ముగూడెం(రామాపురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్ని గదులు శిథిలావస్థలో ఉన్నాయి. ఇక్కడ ఆరు, ఏడో తరగతి విద్యార్థులను ఆరుబయటే బోధన చేస్తున్నారు. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరహాలో ఈ పాఠశాలలో విద్యార్థుల అధికంగా ఉన్నారు. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా రూ.3.70 లక్షలు మంజూరైనా మంచినీటి సదుపాయం లాంటి చిన్న చిన్న అవసరాలకు సరిపోయాయి. గదులు శిథిలావస్థలో ఉండటంతో ఆరుబయటే బోధిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై టీజీ ఈడబ్ల్యూఐడీసీ (తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) ఏఈ ఓబులేసును వివరణ కోరగా మైనర్ మరమ్మతులకు సంబంధించి మాత్రమే నిధులు విడుదలయ్యాయని, అదనపు గదులకు, గదుల మరమ్మతులకు సంబంధించి ఉన్నత అధికారులకు నివేదించామన్నారు. వారి ఆదేశాల మేరకు నిధులు మంజూరైతే పనులను ప్రారంభిస్తామని తెలిపారు.



అమ్మమ్మలు ఆశీర్వదించే..!

న్యూస్‌టుడే బృందం: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం, వారోత్సవ వేడుకలను అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల అమ్మమ్మలు, నాయనమ్మలను కేంద్రానికి తీసుకొచ్చారు. కుటుంబాల్లో వారి ప్రాధాన్యం, అనుబంధాల గురించి విద్యార్థులకు తెలియజెప్పారు. అనంతరం కేంద్రం, సమీప పాఠశాల విద్యార్థులు అమ్మమ్మలు, నాయనమ్మల దీవెనలు అందుకున్నారు.


మేళ్లచెరువు: అమ్మమ్మలు, నాయనమ్మల ఆశీర్వాదం అందుకుంటున్న విద్యార్థులు

ప్రత్యేక అలంకరణలో స్వామివారు



శివాలయాలలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ చేశారు. గరిడేపల్లి లోని శివాలయంలో పారిజాత పుష్పాలతో శివలింగాన్ని వినూత్నంగా అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చి పూజలు, అభిషేకాలలో పాల్గొన్నారు. – గరిడేపల్లి, న్యూస్‌టుడే

పట్టు వీడలేదు.. లక్ష్యం మరువలేదు



హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువు.. పేద కుటుంబం. తండ్రి మేస్త్రీ పని. చదువు పూర్తి కాగానే పెళ్లి.. ఒక పాప.. ఇన్ని బాధ్యతల నడుమ ఉపాధ్యాయురాలిని కావాలనే లక్ష్యాన్ని మరువలేదు. డీఎస్సీ రాసేనాటికి బాబుకు 20 రోజులే అయినా చెక్కుచెదరని విశ్వాసం ఫలితంగా సెకండరీ గ్రేడ్ టీచర్ ఫలితాలలో 79.70 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 15వ ర్యాంకు సాధించారు **దేవిశెట్టి అరుణ.** అరుణ గోవిందపురానికి చెందిన తాపీ మేస్త్రీ వెంకన్న కూతురు. చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదివింది. పరిస్థితులు అనుకూలించక ఓపెన్ డిగ్రీ పూర్తి చేశారు. వివాహమై 8 సంవత్సరాలైనా పుస్తకానికి దూరం కాకుండా, ఎలాంటి కోచింగ్‌లు లేకుండా మంచి ఫలితం సాధించినట్లు అరుణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



చిలుకూరు: మండల కేంద్రానికి చెందిన **మాదాసు పుష్ప** 31వ ర్యాంక్ సాధించారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ కూతురిని చదివించారు. వారి కష్టాన్ని చూస్తూ కష్టపడి చదివినట్లు ఆమె తెలిపారు.



మునగాల: మండల కేంద్రానికి చెందిన **కొండా అమూల్య** జనరల్ ర్యాంకింగ్‌లో 57వ ర్యాంక్ సాధించారు. అమూల్య తండ్రి మట్టయ్య రైస్ మిల్లులో గుమస్తా, తల్లి నాగమణి వ్యవసాయ కూలీ. నిరుపేద కుటుంబంలో జన్మించినా చిన్నతనం నుంచి చదువుల్లో రాణించారు.



హుజూర్‌నగర్ గ్రామీణం: లక్కవరం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోనుగంటి రాంరెడ్డి భార్య **త్రివేణి** 79 మార్కులు సాధించి నల్గొండ జిల్లాలో 20వ ర్యాంక్ పొందారు. మాడ్గులపల్లి గ్రామానికి చెందిన కట్ట త్రివేణికి లక్కవరం గ్రామానికి చెందిన కోనుగంటి రాంరెడ్డితో వివాహమైంది. ఎలాంటి శిక్షణ తీసుకోకుండా ఇంటి వద్దనే బాబును చూసుకుంటూ చదివి ర్యాంక్ సాధించిట్లు ఆమె చెప్పారు.



మఠంపల్లి: ఆర్థిక పరిస్థితులను అధిగమించి ఎమ్మెస్సీ బీఎడ్ పూర్తిచేసిన **కాకుమాను శ్వేత** పట్టుదలతో చదివి నల్గొండ జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. మఠంపల్లి మాంట్‌ఫోర్టు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఆమె స్వగ్రామం కేతేపల్లిలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. తల్లిదండ్రులు చెన్నయ్య, అన్నమ్మ ఉన్న కొద్దిపాటి భూమిలోనే వ్యవసాయం చేసుకుంటూ రెక్కల కష్టంతోనే తనను చదివించారని శ్వేత చెప్పారు. భర్త జయరాజు, మామయ్య అంతోని ప్రోత్సాహంతో పాటు ప్రధానోపాధ్యాయుడు బ్రదర్ వినోద్ రెడ్డి సహకారంతో జిల్లా స్థాయి ర్యాంకు సాధించగలిగానని శ్వేత పేర్కొన్నారు.



నేరేడుచర్ల: ఓ పక్క చౌటుప్పల్ సర్వేల్‌లో టీజీటీ ఉద్యోగం, మరోపక్క ఇద్దరు పిల్లలతో కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే పట్టుదలతో చదివి స్కూల్ అసిస్టెంట్ గణితంలో 77.10 మార్కులతో జిల్లాలో రెండో ర్యాంక్ సాధించి ఔరా అనిపించారు కల్లూరు గ్రామానికి **కొండ జ్యోతి.**


శ్రుతి


ఉష

గరిడేపల్లి: మండలంలో ఇద్దరు మహిళలు ఎస్జీటీ విభాగంలో మంచి ర్యాంకు సాధించారు. వెల్దండ గ్రామానికి చెందిన తుమ్మల ఉష 40వ ర్యాంకు సాధించారు. మర్రికుంట గ్రామానికి చెందిన యర్రంశెట్టి శృతి డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్(సాంఘిక శాస్త్రం)కు ఎంపికయ్యారు. మహిళా విభాగంలో ప్రథమ ర్యాంకు కాగా, ఎస్జీటీలో 12వ ర్యాంకు సాధించారు.

చదువులో రాణించి.. ఆదర్శంగా నిలిచి



కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: చిమిర్యాలకు చెందిన **అమరబోయిన రాజశేఖర్** సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాలలో సాంఘికశాస్త్ర సబ్జెక్టులో జిల్లాలో 28వ ర్యాంకు సాధించారు. చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం పూర్తి చేసిన రాజశేఖర్.. ఓ పూట ప్రైవేటు పాఠశాలలో బోధన చేస్తూ, మరో పూట ఆటో నడిపేవారు. మంచి ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



గరిడేపల్లి: తాళ్లమల్కాపురం గ్రామానికి చెందిన గుండు **అంజనికుమార్** 79.50 మార్కులతో తొమ్మిదో ర్యాంకు సాధించారు. తండ్రి ప్రోత్సాహంతోనే సాధ్యమైందని తెలిపారు. ప్రస్తుతం మఠంపల్లి మండలంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.



కోదాడ: పట్టణానికి చెందిన **గోటి వీరబాబు** స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లాలో ఐదో ర్యాంకు సాధించారు. పట్టణంలోని బాపూజీ గ్రంథాలయానికి నిత్యం వెళ్లి చదువుతూ ఈ ఉద్యోగం సాధించానని ఆనందం వ్యక్తం చేశారు. వీరబాబు స్వస్థలం ఖమ్మం జిల్లా అయినప్పటికీ కొన్నేళ్లుగా పట్టణంలోనే నివాసం ఉంటున్నారు.



అనంతగిరి: వాయిలసింగారం గ్రామానికి చెందిన **జంగిలి చందర్‌రావు** స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఆంగ్ల సబ్జెక్టులో జిల్లాలో రెండో ర్యాంకు సాధించారు.



నడిగూడెం: కడు పేద కుటుంబం. ఆరు నెలల వయస్సులో తండ్రిని కోల్పోయారు. తల్లి రెక్కల కష్టంతో చదివించింది. తల్లి కష్టాన్ని వమ్ము చేయలేదు కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన **బెల్లంకొండ నవీన్.** ఎస్జీటీ విభాగంలో 76 మార్కులతో 50వ ర్యాంకు సాధించారు.

ప్రకృతి రక్షణ.. అందరి బాధ్యత



హుజూర్‌నగర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎర్త్ క్లబ్ సభ్యులతో సీజీఆర్ సభ్యులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృక్షానికి పూజలు చేసి.. పచ్చదనం కాపాడుతామని ప్రతిజ్ఞ చేసి ఎర్త్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు. సోమవారం జరిగిన కార్యక్రమానికి కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్) రాష్ట్ర అధికారులు యానాల వెంకటరెడ్డి, అమర్‌దీప్, ఎర్త్ క్లబ్ ఛైర్మన్ పాఠశాల ప్రధానోపధ్యాయుడు లతీఫ్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ప్రకృతిని కాపాడే బాధ్యత మనందరం తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో గల పెద్ద వృక్షాన్ని మాతృ వృక్షంగా పరిగణించి ఆ చెట్టు వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రకృతి పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. 6 నుంచి 9వ తరగతి వరకు తరగతికి ఇద్దరు చొప్పున స్కూల్ ఎర్త్‌క్లబ్‌ని ఎన్నుకుని కమిటీలు వేశారు.

గిడ్డంగుల్లో ధాన్యం నిల్వతో అధిక లాభాలు


ధాన్యం నిల్వపై అవగాహన కల్పిస్తున్న మరియాదాస్

గరిడేపల్లి, న్యూస్‌టుడే: గిడ్డంగులలో ధాన్యం నిల్వ చేసుకుంటే రైతులకు అధిక లాభాలు వస్తాయని జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ ఏ.మరియాదాస్ అన్నారు. కేవీకేలో వేర్‌హౌస్ డెవలప్‌మెంట్, రెగ్యులేటరీ యాక్ట్, నెగోషియబుల్ వేర్‌హౌస్‌పై రైతులకు, వ్యాపారులకు, పప్పు మిల్లు యజమానులకు ఒక రోజు అవగాహన కల్పించారు. ఎలుకల బెడద, చీడపీడలతో దాదాపు 30 శాతం పంట నష్టం జరుగుతుందన్నారు. గిట్టుబాటు ధర రాకపోతే గిడ్డంగుల్లో నిల్వ చేసుకొని ధర వచ్చినప్పుడు అమ్ముకోవడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చన్నారు. ధాన్యం, ఇతర ఉత్పత్తుల నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నెగోషియబుల్ వేర్ హౌస్ రిసిప్ట్ గురించి వివరించారు. ఈ-నామ్(ఆన్‌లైన్‌లో)లో రైతులు పంటలను అమ్ముకోవచ్చన్నారు. హెర్మటిక్ సంచుల ప్రయోజనాలను వివరించారు. కేవీకే ప్రోగ్రాం ఇన్‌ఛార్జి డి.నరేష్, శాస్త్రవేత్తలు డి.ఆదర్శ్, సీహెచ్.నరేష్, ఎ.కిరణ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదాం

కోదాడ, న్యూస్‌టుడే: పట్టణాన్ని జిల్లాల్లోనే స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతామని పుర ఛైర్‌పర్సన్ ప్రమీల అన్నారు. సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణ వాసులు, కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.


పట్టణ వాసులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న పుర ఛైర్‌పర్సన్ ప్రమీల, పుర కమిషనర్ రమాదేవి

నేరేడుచర్ల: పట్టణంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం పౌరులకు అందించిన హక్కులను అందరూ అనుభవించాలని, ఎవరైనా దురుద్దేశంతో వ్యక్తుల హక్కులకు భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్సై లక్ష్మీనర్సయ్య హెచ్చరించారు. కోమటికుంటలో నిర్వహించిన జాతీయ పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడారు.


కోమటికుంటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగాల గ్రామీణం: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు.

మేళ్లచెరువు: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలని ఎంపీవో గోపి అన్నారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ముత్తయ్య అన్నారు.

రీజియన్‌లో ఉత్తమ క్లబ్‌గా ఎంపిక

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల వాసవీ, వనితాక్లబ్ రీజియన్‌లో బెస్టు క్లబ్‌గా ఎంపికైనట్లు వాసవీక్లబ్ వైస్‌గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, జోన్‌ఛైర్మన్ వీరవెల్లి శ్రీలత సోమవారం ప్రకటించారు. మిర్యాలగూడలో ఆదివారం జరిగిన రీకాన్ మహోత్సవంలో రీజియన్‌లోని 8 క్లబ్‌ల ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందున్న నేరేడుచర్ల క్లబ్‌కి బెస్టు క్లబ్ అవార్డుతో పాటు, బ్యానర్ ప్రెజంటేషన్, రికార్డుబుక్, మినిట్స్‌బుక్, సీడ్ బాల్స్ తయారీ, తదితర అంశాలలో అవార్డులు పొందినట్లు పేర్కొన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారావు, వనితా క్లబ్ అధ్యక్షురాలు జి.లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు తీసుకుంటున్న క్లబ్ నిర్వాహకులు

ప్రజా పోరాటాల వారధి ఎర్రజెండానే

పాలకవీడు గ్రామీణం: భాజపా, ఆర్ఎస్ఎస్ దేశాన్ని మతం, కులం పేరిట లౌకికతత్వానికి బీటలు కొడుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బొత్తలపాలెంలో పార్టీ సమావేశంలో మాట్లాడారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో సీపీఎం వారధిగా ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శిగా వీరభద్రంను ఎన్నుకొన్నట్లు తెలిపారు.

2 నుంచి క్రికెట్ పోటీలు

నడిగూడెం, న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకొని నడిగూడెం మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అక్టోబరు 2 నుంచి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎ.సురేష్, జి.మహేందర్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభిస్తారని, విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30,016లు, ద్వితీయ రూ.20,016లు, తృతీయ రూ.15,016లు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అనంతగిరి మండలం కొత్తగూడెం, కోదాడ మండలం మంగళితండాలోని పాలేరు వాగు నుంచి అనుమతులు లేకుండా కోదాడకు ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదుగురిపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీ రామకృష్ణ సేవా సమితి కన్వీనర్ సుబ్రమణ్యశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 3 నుంచి 12 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

నేడు రుద్రాభిషేకం, హోమాలు

గరిడేపల్లి: మాసశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం కీతవారిగూడెంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరాలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనం, సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీ లక్ష్మీ గణపతి రుద్ర నవగ్రహ వాస్తు హోమాలు జరుగుతాయని పూజారి శ్రీరామయ్యశర్మ తెలిపారు.

అవీ ఇవీ

విద్యుత్తు అంతరాయం.. మఠంపల్లి: 132కేవీ మఠంపల్లి ఉపకేంద్రంలో మంగళవారం మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9గంటల నుంచి 11వరకు మండల వ్యాప్తంగా విద్యుత్తు సరపరా ఉండదని ఏఈ హరీశ్‌రెడ్డి సోమవారం తెలిపారు.

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం పట్టణంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రాంప్రసాద్ సోమవారం తెలిపారు.

అందజేత.. మునగాల: గణపవరం గ్రామానికి చెందిన మహేశ్వరి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. అదే గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ అమరబోయి లింగరాజ్ యాదవ్ ఆమె కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు.

బంగారు పతకం.. చిలుకూరు: మిర్యాలగూడలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీలలో నారాయణపురాని(పాలెఅన్నారం)కి చెందిన రషీద్ బంగారు పతకాన్ని సాధించినట్లు సోమవారం తెలిపారు.

అప్పగింత.. నేరేడుచర్ల: చరవాణులు పోగొట్టుకున్న నాగమణి, గంగయ్య, వీరభద్రయ్య, పద్మలకు సీఈఐఆర్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా వాటిని పోలీసులు పట్టుకున్నారు. నేరేడుచర్ల ఎస్సై రవీందర్ ఆ చరవాణులను సోమవారం పోగొట్టుకున్న వారికి అందజేశారు.

ఫిర్యాదు.. మునగాల: మండల కేంద్రంలోని పలు సమస్యలపై సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థుడు కృష్ణ కోరారు. సంబంధిత శాఖ అధికారులపై జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సన్మానం.. కోదాడ పట్టణం: అంకితభావంతో పని చేస్తే గుర్తింపు లభిస్తుందని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చందా అప్పారావు అన్నారు. తెలుగు అధ్యాపకురాలిగా పనిచేసిన బంగారు శ్రీదేవి సోమవారం పదవీ విరమణ, వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. శ్రీదేవి దంపతులను సన్మానించారు.

పరామర్శ.. కోదాడ, కోదాడ పట్టణం: నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో కోదాడకు చెందిన ఈవీరెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపక సభ్యులు రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, తదితరులు సోమవారం పరామర్శించారు.

అందజేత.. మేళ్లచెరువు: రామాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు.

నివాళి.. నడిగూడెం: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా గురవయ్య సేవలు అభినందనీయమని, ఆయన మృతి ఉద్యమానికి తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు. శ్రీరంగాపురంలో జరిగిన వర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. బి.అబ్రహం, శ్రీను, వీరబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డిమాండ్.. మోతె: అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సైదులు డిమాండ్ చేశారు. గోల్ తండాలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

నిధులు విడుదల చేయాలి.. నేరేడుచర్ల: ప్రభుత్వం రైతు భరోసాకి వెంటనే నిధులు విడుదల చేయాలని సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు శేఖర్‌రావు కోరారు. ముకుందాపురంలో సోమవారం జరిగిన సీపీఎం సమావేశంలో మాట్లాడారు.

అభినందన.. నడిగూడెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన నడిగూడెం కేవీఎన్ కళాశాల ఈటీ కోర్సు విద్యార్థిని సోమవారం కళాశాల ప్రిన్సిపల్ డి.విజయనాయక్ అభినందించారు.

నడిగూడెం: నడిగూడెం పంచాయతీ కార్యదర్శిగా, ఇన్‌ఛార్జి ఎంపీవోగా విధులు నిర్వహించిన దుర్గా ప్రసాద్ సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సోమవారం జరిగిన ఆయన పదవి విరమణ అభినందన వీడ్కోలు సమావేశంలో ఆయన సేవలను కొనియాడారు. తహసీల్దార్ సరిత, ఎండీవో ఇమామ్, ఎంపీవో విజయలక్ష్మి, అధికారులు సత్కరించారు.

పైపులైను సర్వేపై మళ్లీ రైతుల అభ్యంతరం

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ఎంబీసీ ఎత్తిపోతల పైపులైను సర్వే పనులు మళ్లీ మొదలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలోనే ఈ పథకం పనులు ప్రారంభించేందుకు చేపట్టిన సర్వేపై మేళ్లచెరువు మండల రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో అప్పట్లో సర్వే దశ అసంపూర్ణంగా నిలిచిపోయింది. ఐనప్పటికీ చింతలపాలెం మండలంలోని పాత వెల్లటూరు వద్ద పథకం ఏర్పాటుకు సంబంధించి కృష్ణానదీ తీర ప్రాంతంలో ఐరన్ పైపుల తయారీ కొనసాగింది. ప్రస్తుతం అక్కడ వందల సంఖ్యలో తయారు చేసిన పైపులను భద్రపరిచారు. ఇప్పుడు మళ్లీ ప్రైవేటు ఏజెన్సీ వారు చేపట్టిన సర్వేపైనా సోమవారం రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే పనులను కొనసాగించవద్దని వారితో వాదనకు దిగారు. తమ అనుమతులు లేకుండా తమ పొలాల్లో ఎలా సర్వే చేస్తారని నిలదీశారు. పొలాల్లో దారులు ఏర్పాటు చేస్తే కొద్దోగొప్పో ఉన్న తమ పొలాలు తమకు దక్కకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.


సర్వే బృందంతో వాదన చేస్తున్న రైతులు

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర, **రంగా:** సత్యం సుందరం

సూర్యాపేట
• సూర్యాపేట • తుంగతుర్తి

ఆడిట్‌కు దస్త్రాలు మాయం

నూతనకల్, న్యూస్‌టుడే: నిధుల ఖర్చుపై ఏటా ఆడిట్‌లో భాగంగా ముందస్తు సమాచారం అందించి సోమవారం చిల్పకుంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఆడిట్ అధికారి వెళ్లాలని వచ్చారు. వెంకేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తాళ్లపల్లి వెంకన్న చిల్పకుంట్ల కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దస్త్రాలు అందిస్తే ఆడిట్ చేస్తామని చెప్పగా.. కాళ్ల బీరువా చూపించి ఏ విధమైన పత్రాలు తనకివ్వలేదని కార్యదర్శి సమాధానమిచ్చారు. వెంటనే ఆడిట్ అధికారులు మండలపరిషత్ కార్యాలయానికి చేరుకొని ఎంపీడీవో సునిత, ఎంపీవో శశికళకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో పనిచేసిన కార్యదర్శి గ్రామ పంచాయతీ దస్త్రాలను ఇన్‌చార్జికి అప్పగించకుండా బదిలీపై వెళ్లడని, ఫోన్‌చేస్తే సమాధానం లేదని వారు వివరించారు. రెండ్రోజుల్లో దస్త్రాలు అందుబాటులో ఉంచాలని, మళ్లీ మారు వచ్చి అక్కడే ఆడిట్ చేస్తామని తెలిపారు.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని అంబేడ్కర్‌నగర్ రోడ్డులో తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడింది. నీటి సరఫరా సమయంలో వృథాగా పోతుంది.
– శంకర్, అంబేడ్కర్‌నగర్

✔ సిబ్బందితో వెంటనే మరమ్మతు చేయిస్తాం.
– తిరుమలయ్య, పుర ఏఈ, సూర్యాపేట

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి నోచుకోలేదు. మట్టి రోడ్లపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– వెంకన్న, జాకీర్‌హుస్సేన్‌నగర్

✔ నిధుల లభ్యతను బట్టి నిర్మిస్తాం.
– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ఓటు నమోదు తప్పనిసరి

చివ్వెంల, న్యూస్‌టుడే: వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు 2025 మార్చిలో జరగనున్నందున అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఓటును నమోదు చేసుకోవాలని టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బీకుల్ల సాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సోమవారం కలిసి వారికి ఓటు నమోదు పత్రాలతో పాటు కరపత్రాలను అందజేసి మాట్లాడారు. అనంతరం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంఈవో కత్తరాజ్, యామా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: జీవితం కఠినవ వర్గాలకు పాఠశాల నీట మునిగి విద్యార్థుల పుస్తకాలు తడిసి పాడవటంతో మిర్యాల గ్రామానికి చెందిన తన మిత్రుడు మెంచు సోమనర్సయ్య జ్ఞాపకార్థం కాసా శ్రీనివాస్, దారం శ్రీనివాస్‌లు సోమవారం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శివయ్య, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లింగారెడ్డి, వాంకొడోత్ వెంకన్న, సిబ్బంది సిద్దికపాషా, అజయ్‌కుమార్, చిలకమ్మ, సీతా రవి, అరుణ, మంగు పాల్గొన్నారు.


మిర్యాలలో విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

రాత్రి చీకట్లు.. పగలు వెలుగులు


సూర్యాపేటలోని 10వ వార్డులో వీధి దీపాలు వెలగక నెలకొన్న అంధకారం

○ పేటలో వీధి దీపాల నిర్వహణ అధ్వానం

భానుపురి, న్యూస్‌టుడే:

సూర్యాపేట పట్టణంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు ఆరిపోతాయో తెలియటం లేదు. దీంతో పట్టణ ప్రజలు రాత్రి పూట ఇక్కట్లు పడుతున్నారు. కొన్నిచోట్ల నిరంతరం వెలుగుతున్నా పట్టించుకోనేవారే కరవయ్యారు. దీంతో విలువైన విద్యుత్తు వృథా అవుతోంది.

ఎక్కడెక్కడంటే.. సూర్యాపేట పట్టణంలో జాకీర్‌హుస్సేన్‌నగర్, ఖమ్మం రోడ్డు, పీఎస్ఆర్ సెంటర్, 10వ వార్డు, శ్రీరాంనగర్, గిరినగర్, తదితర కాలనీల్లో రాత్రి పూట వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రి సమయంలో చీకట్లు ఉండటంతో బయటకు రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. చాలారోజులుగా పరిస్థితి ఇలానే ఉన్న సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీల్లో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. ఎక్కడి నుంచి విషసర్పం వచ్చి కాటేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఇక్కడ నిరంతరం వెలుగులు.. సూర్యాపేట పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్, భీమారం రోడ్డు, శ్రీరాంనగర్, బాలాజీనగర్, తదితర చోట్ల నిరంతరం వెలుగుతున్నాయి. వాటిని ఉదయమే ఆర్పివేయాల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కాలనీవాసులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో విలువైన విద్యుత్తు వృథా అవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలనీల్లో వీధి దీపాలు వెలిగేలా చూడటంతోపాటు నిరంతరం వెలుగుతున్న వాటిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


భీమారం రోడ్డులో నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలు

వెంటనే చర్యలు చేపడతాం..

సూర్యాపేట పట్టణంలో వీధి దీపాలు వెలగటం లేదని మా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలన చేపట్టి వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి వెలిగేలా చూస్తాం. ప్రజలు కూడా మా దృష్టికి తీసుకురావాలి.
– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

చెట్లకొమ్మల తొలగింపు

నూతనకల్, న్యూస్‌టుడే: మండలంలోని సోమ్లాతండా గ్రామపంచాయతీ భవనం చెట్లకొమ్మలతో అల్లుకుపోయి ఎండ తగలక, వాన నీటితో తడిసి నిమ్మపట్టడంపై 'ఈనాడు'లో తడిసిన గోడలు.. శిథిలావస్థలో పైకప్పు' శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి జోయిక్ వెంకన్న సిబ్బందితో చెట్ల కొమ్మలను తొలగించారు.

ముమ్మరంగా మరమ్మతులు

నూతనకల్: ఇటీవల వరదలకు కోతకు గురైన నూతనకల్-యడవెల్లి, తాళ్లసింగారం-పాతర్లపహాడ్, తాళ్లసింగారం-టీక్యా తండా రోడ్ల ఆధునీకరణ పనులు వేగంగా తంగా చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ ఏఈ యాదయ్య పేర్కొన్నారు. కోతకుగురైన చోట మట్టిని పోసి చదును చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆ పనులను సోమవారం ఆయన పరిశీలించారు.



ముందస్తు పూల సంబరం

మద్దిరాల, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ముందస్తుగా నిర్వహించారు. విద్యార్థినిలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయినులతో కలిసి ఆడి పాడారు. ఎస్వో తేజశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: కొమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సోమవారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో అలరించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఉప్పలయ్య పైదలు, ఉపాధ్యాయురాలు సృజన, అంగన్‌వాడీ టీచర్ శివరంజని, యశోద, పద్మ పాల్గొన్నారు.


కొమటిపల్లి పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారులు

బాధిత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కనీస వేతన చట్టం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని ఎన్.అన్నారంలో సోమవారం నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఫైనాన్స్ పేరుతో పేదల నుంచి తెలంగాణ వాళ్లు భరించకుండా కాపాడాలన్నారు. ఇప్పటికే ఇళ్లు కూల్చిన బాధితుల కుటుంబాలను తక్షణమే పునరావాసం కల్పించాలన్నారు. సూర్యాపేట పట్టణంలోని సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువు, మట్టు పక్కల కబ్జాలు ఉన్నా ఇక్కడ మార్కింగ్ వేయడం సరికాదన్నారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా బత్తుల రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యుడు శ్రీకాంత్ వర్మ, మండల కార్యదర్శి కృష్ణ, రవి, సత్యం, శ్రీనివాస్, నర్సయ్య, సత్యం, వెంకన్న, పాపయ్య, వీరస్వామి, ముత్తయ్య పాల్గొన్నారు.


ఎన్.అన్నారంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు

తిరుమల పవిత్రతను కాపాడండి

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: తిరుపతి దేవస్థాన పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, పార్యతం శ్రీధర్ పేర్కొన్నారు. తిరుమల లడ్డూ కల్తీ చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి నిరసన పాదయాత్రను సోమవారం నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి నామాలు పఠిస్తూ అర్చకుల వేదమంత్రాలను ఉచ్చరిస్తూ యాత్ర కొనసాగింది. పట్టణంలోని వాణిజ్య భవన్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేవాలయాల, ధార్మిక సంస్థల ఐక్య వేదిక సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.


సూర్యాపేట వాణిజ్య భవన్ సెంటర్ వద్ద నినాదాలు చేస్తున్న దేవాలయాల, ధార్మిక సంస్థల ఐక్యవేదిక సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు తదితరులు

పట్టుపట్టి.. ర్యాంకు కొట్టి



తిరుమలగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన **వంగరి శ్రీనివాస్** 81.5 మార్కులతో జిల్లాస్థాయిలో 6వ ర్యాంకుతో ఎస్జీటీ ఉద్యోగానికి అర్హత సాధించారు.. గ్రామానికి చెందిన వంగరి కోటయ్య, పద్మలు నిరుపేద కుటుంబానికి చెందిన చిన్న కుమారుడు శ్రీనివాస్ మండల కేంద్రంలో ఇంటర్ చదువును పూర్తి చేశాడు. డీఈడీ విద్యను సూర్యాపేటలోని వెన్నెల కళాశాలలో చదివారు. ఉపాధ్యాయ వృత్తి పైఇష్టం మక్కువతో డీఎస్సీనికి కృషితోపాటు అవగాహనతో వెళ్లి శిక్షణ తీసుకున్నారు.



పెన్‌పహాడ్: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన **మిర్యాల హరికృష్ణ** ఎస్జీటీ విభాగంలో 78.33 మార్కులతో 21వ ర్యాంకు సాధించారు. పేదకుటుంబంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సంపాదించాలనే లక్ష్యంతో హరికృష్ణ పట్టుదలతో చదివారు. డీఎస్సీలో మంచి ర్యాంకు రావడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెన్‌పహాడ్: మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన **ఉప్పునూతల శ్రవణ్‌కుమార్** ఎస్జీటీ విభాగంలో 76.97 మార్కులతో 34వ ర్యాంకు సాధించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన శ్రవణ్ ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనే తపనతో కృషిచేసి మంచి మార్కులు సంపాదించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా ప్రథమ ర్యాంకు..



మండలంలోని లింగాల గ్రామానికి చెందిన **ఏసు రాజు సైదులు** డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో 82.23 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సంపాదించారు. ప్రస్తుతం ఈయన సర్వేల్లో టీజీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

అంగవైకల్యంతో..



నూతనకల్, న్యూస్‌టుడే: పుట్టుకతోనే పోలియోతో ఒక కాలు చచ్చుబడిపోయి కర్రసాయంతో నడుస్తూ పాఠశాల బాట పట్టిన మండలంలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన **జటంగి సాంబయ్య** డీఎస్సీ ఎస్జీటీ ఫలితాల్లో 76.77 మార్కులతో జిల్లాస్థాయిలో 36వ ర్యాంకు సాధించారు. జటంగి వెంకన్న, ముత్తిలింగమ్మకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు జటంగి సాంబయ్య ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు, సోదరుల ఆనందానికి అవధులు లేవు. గ్రామస్థులు సాంబయ్యను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

భర్త భరోసాతో..



నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లింగంపల్లికి చెందిన **మారం విభవ** డీఎస్సీ ఫలితాల్లో తెలుగు పండిట్ విభాగంలో జిల్లాస్థాయి మహిళా కేటగిరిలో ఒకటో ర్యాంకు సాధించారు. భర్త ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని ఆమె పేర్కొన్నారు.

గురుకుల నిర్మాణానికి కృషి: ఎమ్మెల్యే


కాసర్లపహాడ్‌లో బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ పేర్కొన్నారు. కాసర్లపహాడ్ గ్రామంలోని ఏడెకరాల ప్రభుత్వ స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కంపచెట్లతో ఉండటంతో ముందుగా ఆ స్థలాన్ని చదును చేయిస్తానన్నారు. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బాలెంలలో అద్దె భవనంలో నడుస్తుందని చెప్పారు. అనంతరం పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేసి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అరిగెల రాజేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యం, యువజన సంఘం జిల్లా కార్యదర్శి గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు లింగస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలు పండించాలి

నాగారం, న్యూస్‌టుడే: వరి, పత్తి పంటలతోపాటు చిరుధాన్యాలు పండించడానికి రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే మందుల సామేల్ పిలుపునిచ్చారు. నాగారంలో ఓ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ దార శ్రీనివాస్, ఏవో కృష్ణకాంత్, ఏఈవో శోభారాణి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్దన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య యాదవ్, పీఏసీఎస్ ఛైర్మన్ కుంట సురేందర్‌రెడ్డి, నాపెడ్ సంస్థ సీఈవో మట్టేశ్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని నెమ్మికల్‌లో సోమవారం గ్రామపంచాయతీ, ఐటీసీ గ్రీన్ క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీధులను శుభ్రం చేశారు. గ్రామ పరిశుభ్రత కోసం వారానికి రెండు గంటలు సమయం కేటాయిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి ఎల్లంకి రమణ, ఏఎన్ఎం పూలమ్మ, ఐటీసీ గ్రీన్‌క్రాస్ మండల ఇన్‌చార్జి అంతటి రవీందర్, సురేష్, వెంకన్న, నవీన్, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, రజిత, పద్మ, ఇందిర, నాగమణి, హెచ్ఎం శ్రీహరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


నెమ్మికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల సిబ్బంది

పోరహక్కుల దినోత్సవం

నాగారం, న్యూస్‌టుడే: సమాజంలో కులమత తారతమ్యాలకు తావులేని మండల వసతిగృహ సంక్షేమాధికారి సోమాచారి పేర్కొన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్థమానుకోటలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నయాబ్ తహసీల్దార్ షాహినాబేగం, పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్ పాల్గొన్నారు.

వీధిదీపాల అందజేత

నాగారం, న్యూస్‌టుడే: మామిడిపల్లిలో వీధిదీపాలు లేకపోవడంతో చీకటిలో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా గ్రామంలోని యువకులు తమకు తోచిన సాయంతో రూ.35వేలు పోగుచేసి వీధి దీపాలను కొనుగోలు చేశారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శి సంతోష్, సిబ్బందికి అందజేశారు. మండల కాంగ్రెస్ నాయకులు పసులేటి వెంకటరెడ్డి, శీలకృష్ణమూర్తి, సోమిరెడ్డి, యాదగిరి, యువకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన వీరబోయిన అఖిలేశ్ యాదవ్ ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లాస్థాయిలో జరిగే క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలోని ఎస్జీఎఫ్ క్రికెట్ అకాడమీలో జరిగిన క్రికెట్ పోటీల్లో 14 ఏళ్లలోపు బాలుర విభాగంలో పాల్గొని ఓపెనింగ్ బ్యాటర్‌గా రాణించిన అతనిని నిర్వాహకులు జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ నెల 3న జరిగే పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు నుంచి ఆడనున్నాడు.

పెద్దల మాటలు గౌరవించాలి

నాగారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో వృద్ధులను సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, సుమిత్ర, సరస్వతి, హరిత, లక్ష్మి, మంజుల, రూపమ్మ పాల్గొన్నారు.

మద్దిరాల, న్యూస్‌టుడే: పెద్దల మాటలు, ఆదరాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని అంగన్‌వాడీ టీచర్ కాటి అంజలి, అచ్చమ్మ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ 2,4 ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారు. పిల్లలు, తల్లిదండ్రులు, చిన్నారుల గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ప్రతిభ

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఐదో రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలను సోమవారం నిజామాబాద్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో 35 నుంచి 45 సంవత్సరాల విభాగంలో సూర్యాపేట పట్టణానికి చెందిన గూడూరు నాగేశ్వరరావు మొదటి స్థానాన్ని పొంది భారతీయ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారు. సూర్యాపేట పట్టణానికి చెందిన దేశగాని ఉప్పలయ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి నాల్గో స్థానాన్ని పొందారు. వీరికి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ బహుమతులను అందజేసినట్లు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు.

కరాటేలో దీక్షిత్‌నాయక్..

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన లకావత్ దీక్షిత్ కరాటే పోటీల్లో ప్రతిభను చాటి బంగారు పతకాన్ని సాధించాడు. సుమన్ షోటోకాన్ అకాడమీ ఆధ్వర్యంలో మిర్యాలగూడెం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన 22వ నేషనల్ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ 9 ఏళ్లలోపే విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బహుమతి పొందాడు. కరాటే శిక్షకులు అంకూరి అరుణ పలువురు అభినందించారు.

చెడు రుగ్మతలను వీడాలి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: కులవివక్ష తదితర చెడు రుగ్మతలను విడనాడి సమసమాజ స్థాపనకు అందరూ కృషిచేయాలని ఎస్సై రవీందర్, ఎంఆర్ఐ రంజిత్‌రెడ్డి కోరారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని సింగారెడ్డిపాలెం ఎస్సీకాలనీలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరం అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పౌరహక్కులపై అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి అఖిల్, కొండేటి సతీష్, పాల్వాయి చంద్రశేఖర్, గోపయ్య, చంటి, రాంబాబు, నాగయ్య పాల్గొన్నారు.


సింగారెడ్డిపాలెంలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవీందర్

నీలి ఆకాశం.. ఎంతో అద్భుతం

ఈ చిత్రాన్ని చూస్తే 'నీలి నీలి ఆకాశం ఇద్దామనుకున్నా... మబ్బులు నిన్నే కమ్మేస్తాయని మానేస్తూ ఉన్నా..' అన్న పాట పాడాలనిపిస్తుంది కదూ. ఈ సుందర దృశ్యం సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద ఆవిష్కృతమైంది. ఆకాశం నీలి రంగులో ఉండగా.. మబ్బుల మాటున సూర్యుడు అస్తమిస్తూ ఆ కిరణాలు ప్రకాశించడంతో ఈ అద్భుతంగా కనిపించింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఈ చిత్రాన్ని చూసిన పలువురు తమ చరవాణుల్లో బంధించారు.
– సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే



విద్యా వ్యవస్థను మెరుగు పరచాలి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్.రాములు

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్ను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ, రిపోర్టును త్వరగా పూర్తి చేసి అమలు చేసినట్లయితే రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగుపడుతుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్.రాములు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం రెండో రోజు జరిగిన టీఎస్ యూటీఎఫ్ ఆయిదో జిల్లా మహాసభలలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆ సంఘం తరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాస్‌రెడ్డి, అరుణ భారతి, జిల్లా కోశాధికారిగా జి.వెంకటయ్య, జిల్లా కార్యదర్శులుగా ఆర్.దామోదర్, ఎన్.నాగేశ్వరరావు, వి.రమేష్, జె.కమల, సోమయ్య, రమేష్, పాండురంగాచారి, బాలసైదిరెడ్డి, జ్యోతి, రవీందర్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, అనిల్ కుమార్, మంగ, ధనమూర్తి, యాకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3206	1756
జైశ్రీరాం	3216	1679
ఐఆర్-64	2086	1876
హెచ్ఎంటీ	2929	2252
కందులు	9742	4502
పెసర	7529	2502
వేరుసెనగ	7489	2579
మినుములు	6302	5193

సంక్షిప్త సమాచారం

అంటరానితనం అమానుషం.. నూతనకల్, న్యూస్‌టుడే: అంటరానితనం అమానుషమని నూతనకల్ ఆర్ఐ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని తాళ్లసింగారంలో పౌరహక్కుల దినం నిర్వహించి మాట్లాడారు. కొత్తగూడెంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కులవివక్షతను పక్కనపెట్టి మానవత్వంతో సమానంగా మెలగాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య, పోలీస్ అధికారి మల్లయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలి.. మద్దిరాల గ్రామీణం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలని మండల విద్యాధికారి తండు విజయనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలో సోమవారం కుక్కడం ఉన్నత పాఠశాలలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే టెస్టు మాదిరి పరీక్షను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, సూచనలను చేశారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు యల్లాగౌడ్, రవీందర్, రామదేవి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నివాళి.. మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: గోరెంట్ల గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు షేక్ చాంద్ బీ మరణం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. సోమవారం ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా కార్యదర్శి సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి ఉపేందర్, సైదులు, రంగయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం.. తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని వెలుగుపల్లికి చెందిన ముత్యాల మహేష్ సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో జరిగిన వేడుకలో డాక్టరేట్‌ను స్వీకరించారు. పదేళ్లుగా సామాజిక సేవ కుడిగా సేవ చేస్తున్న మేక్ ఎ ఫౌండేషన్ వ్యవస్థాపకుడైన మహేష్‌కు ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్మార్ట్ అకాడమీ, స్మార్ట్ ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, వీసీ ఆఫ్ ఇండియా ఎస్జీటీ, ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ లయన్ ఆకుల రమేశ్ చేతుల మీదుగా అందుకున్నారు.

స్ఫూర్తి సర్వీస్ సొసైటీ అవార్డు.. పెన్‌పహాడ్: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన దాసరి పరంగ శ్రావణ్ ఫులే భారతీయ స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా సంస్థ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సరస్వతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు ఆయనకు అవార్డును అందజేశారని ఆయన సోమవారం తెలిపారు. తను చేపట్టిన సామాజిక కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును తనకు ప్రదానం చేయడంపై సంస్థ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలను పట్టించుకోని ప్రభుత్వం.. తుంగతుర్తి: ఒట్ల కోసం అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి గెలిచిన అనంతరం ప్రజలను పట్టించుకోకుండా ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని సీపీఎం జిల్లా మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం తుంగతుర్తిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడ్డం ఎల్లయ్య, వెంకయ్య పాల్గొన్నారు.